మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర   సంపుటి : 08   సంచిక : 220   ఆదివారం   15 - 02 - 2026   పేజీలు: 8   వెల: 4

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



2లో..

### ప్రధాని మోదీ ప్రారంభించిన
# మెగా ప్రాజెక్టులు

- ఈశాన్యాభివృద్ధికి రూ.5,450 కోట్ల ప్రాజెక్టుల ఆరంభం
- మౌలిక సదుపాయాలు, రవాణా, డిజిటల్ రంగాలకు ఊతం
- భద్రతా దృష్ట్యా కీలకమైన అత్యవసర ల్యాండింగ్ కేంద్రం





మన గళం, దిబ్రూగఢ్/గువాహటి : అస్సాం పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి మోదీ పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. సుమారు రూ.5, 450 కోట్ల వ్యయంతో రూపొందిన మౌలిక సదుపాయాల పనులకు శ్రీకారం చుట్టారు. ఈశాన్య భారతదేశంలో తొలి అత్యవసర ల్యాండింగ్ ఫెసిలిటీ (జూఖీ), బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతు, జాతీయ డేటా సెంటర్, ఐఐఎంగువాహటి విస్తరణ, పీఎమ్ ఈ-బస్ సేవ పథకం కింద 225 2 లో..

# అసెంబ్లీలో మహాశివరాత్రి సందడి

- శివతత్వానికి ప్రతీకగా ప్రత్యేక చీరల్లో మహిళా ప్రజాప్రతినిధులు
- బడ్జెట్ అనంతరం ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ
- స్పీకర్, మంత్రులతో ఆత్మీయ కలయిక



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రేపటి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని కూటమి ప్రభుత్వానికి చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు శివతత్వానికి ప్రతీకగా ఉన్న ప్రత్యేక చీరలను ధరించి సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఒకే రకమైన వస్త్రధారణతో అసెంబ్లీకి విచ్చేసిన మహిళా ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్ సవితతో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా వస్త్రధారణ చేయడం విశేషంగా నిలిచింది. మహిళా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో 2 లో..



### ఏపీ బడ్జెట్‌పై బొత్స
# తీవ్ర విమర్శలు

- అంకెల గారడీతో పసలేని బడ్జెట్ అన్న వ్యాఖ్య
- మహిళా సాధికారత, ఉపాధి హామీపై ప్రశ్నలు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయిందని, ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదేపదే ప్రస్తావించడం తప్ప ప్రజలకు ఉపయోగపడే అంశాలు లేవని అన్నారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న ధైర్యం, స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని అభివర్ణించారు. మహిళా సాధికారత పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం వాస్తవాలకు దూరమని అన్నారు. గతంలో 2 లో..

# పరమ శివుడికి ప్రత్యేక పూజలు







మన గళం కర్నూలు నగరంలోని స్థానిక పాత బస్తీ లో ఉన్న శ్రీ శ్రీ శ్రీ అన్న పూర్ణా సమేత కాశి విశ్వేశ్వర స్వామి ఆలయం లో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి ఏ పీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూర్ రాఘవేంద్ర తన మాత్రు మూర్తి కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ నగరూర్ శమంతకమణి తన సతీమణి హిమబిందు సమేతంగా శివుని కి శని వారం పూజలు చేశారు

# తిరుపతి లడ్డూ అంశంపై
# నెల్లూరులో పొర్లుడు దండాల కార్యక్రమం

- అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుతో ప్రత్యేక దీక్ష
- 4.5 కిలోమీటర్ల దూరం గోవింద నామస్మరణ
- వందలాది భక్తులు, జనసైనికుల భాగస్వామ్యం



2 లో..

నెల్లూరు, ఫిబ్రవరి 14 మన గళం : తిరుపతి లడ్డూలో జరిగిన కల్తీ ఘటన కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని పేర్కొంటూ, దీనిపై ప్రతి హిందువు స్పందించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు నెల్లూరులో ప్రత్యేక కార్యక్రమం

## ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



2 లో..

## ప్రధాని మోదీ ప్రారంభించిన మెగా ప్రాజెక్టులు



ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. దిబ్రూగఢ్ జిల్లాలోని మోరన్ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ప్రధాని ప్రత్యేక విమానంలో ల్యాండ్ కావడం విశేషంగా నిలిచింది. భారత వాయుసేన సమన్వయంతో నిర్మించిన ఈ సదుపాయం అత్యవసర పరిస్థితుల్లో సైనిక, పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనుకూలంగా రూపొందించారు. 40 టన్నుల వరకు యుద్ధవిమానాలు, 74 టన్నుల వరకు బరువైన రవాణా విమానాలు వినియోగించగల విధంగా రన్‌వే నిర్మించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ, సహాయక చర్యలకు ఇది కీలకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం గువాహటిలో బ్రహ్మపుత్రపై నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రధాని ప్రారంభించారు. సుమారు రూ.3,030 కోట్ల వ్యయంతో ఆరు లేన్లుగా నిర్మించిన ఈ వంతెన గువాహటిఉత్తర గువాహటి మధ్య ప్రయాణ సమయాన్ని ఏడు నిమిషాలకు తగ్గించనుంది. భూకంపాలను తట్టుకునే బేస్ ఐసొలేషన్ సాంకేతికత, ప్రత్యేక బేరింగులు, బ్రిడ్జి హెల్త్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఇందులో అమలు చేశారు.

అనంతరం గువాహటి లచిత్ ఘాట్ వద్ద పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. జాతీయ డేటా సెంటర్ ద్వారా డిజిటల్ సేవలు బలోపేతం కానుండగా, ఐఐఎంగువాహటి విస్తరణతో ఉన్నత విద్యకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. పీఎమ్ ఈ–బస్ సేవ పథకంలో భాగంగా 225 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించడం ద్వారా పర్యావరణహిత రవాణాకు ప్రోత్సాహం లభించనుంది. ఈ ప్రాజెక్టులు ఈశాన్య ప్రాంత అభివృద్ధికి గొప్ప ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## తిరుపతి లడ్డూ అంశంపై నెల్లూరులో పొర్లుడు దండాల కార్యక్రమం






నిర్వహించారు. జనసేన జిల్లా సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో పొర్లుడు దండాల కార్యక్రమం చేపట్టారు.

శనివారం ఉదయం 8 గంటలకు శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మాగుంట లేయవుట్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వరకు సుమారు 4.5 కిలోమీటర్ల దూరం సాగింది. గోవింద నామస్మరణల మధ్య నూనె మల్లికార్జున యాదవ్ పొర్లుడు దండాలు పెట్టారు. వందలాది భక్తులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణలో జనసేన నాయకులు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. తిరుపతి లడ్డూ అంశంపై నిజానిజాలు వెలికితీయాలని, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం నెల్లూరులో చర్చనీయాంశమైంది.

కార్యక్రమం శాంతియుతంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల విశ్వాసాలకు భంగం కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పాల్గొన్నవారు కోరారు

## ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



అమరావతి, ఫిబ్రవరి 14,మన గళం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బడ్జెట్‌ను రూపుదిద్దే దిశగా చర్చలు సాగినట్లు సమాచారం. అన్నదాతల సంక్షేమం, స్వర్ణాంధ్ర సాకారం లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, రైతులకు భరోసా కల్పించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, పంటలకు సరైన ధరలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలనే దృక్పథంతో బడ్జెట్ రూపకల్పన జరుగుతోందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, పారిశ్రామిక వృద్ధి వంటి రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమైంది. రాష్ట్ర అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి మరియు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక పరిపాలన కొనసాగిస్తామని తెలిపారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక ప్రకటనలు వెలువడనున్నాయి.

## అసెంబ్లీలో మహాశివరాత్రి సందడి



భేటీ సందర్భంగా రాష్ట్రాభివృద్ధి, ప్రజాసేవల అంశాలపై చర్చించినట్లు సమాచారం. పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని శాసనసభ వేదికపై ఐక్యతను ప్రదర్శించడం సానుకూల సంకేతమని పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం అసెంబ్లీ లాబీల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలను కూడా మహిళా నేతలు కలిశారు. శాసనసభ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనడంతో పండుగ ముందస్తు సంబరాలు కనువిందు చేశాయి.

## పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళులు అర్పించిన ద్రోణాచలం సేవాసమితి



మన గళండోన్ 2019 ఫిబ్రవరి 14వ తేదీన జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో పుల్వామా దాడి జరిగి 40 మంది వీర జవాన్లు అమరలైన విషయం తెలిసిందే అప్పుడు వీర మరణం పొందిన వీర జవాన్లను స్మరించుకుంటూ ఈరోజు ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో టౌన్ ఎస్ఐ శరత్ కుమార్ సిఆర్పిఎఫ్ మాజీ జవాన్లు శ్రీ సుధ సి.బి.యస్.ఈ క్యాంపస్ ఎన్.సి.సి క్యాడర్ విద్యార్థులు అందరూ సంయుక్తంగా డోన్ షాదీ ఖానా నుండి కంబాలపాడు సర్కిల్ మీదుగా గాంధీ చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదురుగా అమరులైన వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి ఘన నివాళులు అర్పించడం జరిగినది.

## ఏపీ బడ్జెట్‌పై బొత్స తీవ్ర విమర్శలు

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు పావలా వడ్డీ, సున్నా వడ్డీ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సున్నా వడ్డీ నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేవని, ప్రస్తుతం ఆ పథకం ఎక్కడుందో తెలియదని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఆ పథకానికి కేటాయింపులు కనిపించడంలేదని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధుల కేటాయింపులో కోత పెట్టారని బొత్స ఆరోపించారు. కేంద్రం నిబంధనలు మారడంతో రాష్ట్రం కనీసం రూ.2,000 కోట్లు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, బడ్జెట్‌లో కేవలం రూ.500 కోట్లు మాత్రమే చూపించారని అన్నారు. దీంతో ఈ పథకాన్ని కూడా నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందా అని ప్రశ్నించారు. ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని విమర్శించారు. రాష్ట్ర అప్పుల విషయంలోనూ వాస్తవాలను వక్రీకరిస్తున్నారని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి రూ.9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. తమ ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి రూ.3 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశామని, అంతకుముందు టీడీపీ ప్రభుత్వం రూ.2.30 లక్షల కోట్ల అప్పు చేసిందని వివరించారు. ఈ బడ్జెట్‌లో నిర్దిష్ట కేటాయింపులు, ప్రజలకు భరోసా కలిగించే అంశాలు లేవని ఆయన విమర్శించారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు




మనగళం శ్రీశైలం : మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఏడవ రోజైన ఈ రోజు (14.02.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు విశేష పూజలు జరిపించబడ్డాయి.తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేయబడ్డాయి. అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం, కార్యక్రమాలు శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి.అదే విధముగా ఈ సాయంకాలం ప్రదోష కాల పూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు జరిపించబడుతాయి.

**గజవాహన సేవ :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ రోజు (14.02.2026) రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు గజవాహనసేవ జరిపించబడుతుంది.ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో గజవాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడుతాయి. గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంభాయ్ డోల్ ఢేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్రడోలు కుణిత, జాంజ్ పథక్ ( కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి

ఆదివారం
15 - 02 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## బీసీ సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించిన.. బిసివై పార్టీ కర్నూలు జిల్లా కన్వినర్ ఎల్లార్తి వాల్మీకి అర్జున్

(ఆలూరు మనగళం): కర్నూలు జిల్లా బిసివై పార్టీ కన్వినర్ ఎల్లార్తి వాల్మీకి అర్జున్ ఆధ్వర్యంలో బిసి సంఘం రాష్ట్ర నాయకులు అరికేర తిక్కస్వామి మరియు వాల్మీకి వీరేష్, కాంగ్రెస్ పార్టీ ఆలూరు మండల కన్వినర్ మొలగవల్లి పూల రామాంజి, వాల్మీకి సంఘం నాయకులు తిమ్మప్ప, అంజి, వడ్డే ఓబన్న నాగరాజు, బిసివై యువ నాయకులు నగరూరు సురేష్ ల చేతులమీదుగా ఆలూరు నియోజకవర్గం అతిథి గృహం ఆవరణంలో "బీసీ సింహ గర్జన"కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో 22న జరిగే భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు, యువత పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.



**భారత చైతన్య యువజన పార్టీ అజెండా:**
బీసీ రక్షణ చట్టం అమలు. రాజధాని ప్రాంతంలో బీసీలకు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు. బీసీ కులాల కార్పొరేషన్లకు నిధులు.సమగ్ర కులగణన. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44 % రిజర్వేషన్లు కల్పించాలి.

## పత్తి కొనుగోలు కుంభకోణంలో లిల్లీ రాయిపాటిల్ పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

**– ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లెకల్ వెంకటేష్.**

(ఆలూరు మనగళం): కర్నూలు జిల్లా ఆదోనిలో పత్తి కొనుగోలు కుంభకోణంపై ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లెకల్ వెంకటేష్ ఆలూరు అతిధి గృహం ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మీడియాతో మాట్లాడుతూ సీసీఐ అధికారి లిల్లీ రాయిపాటి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రైతులు నష్టపోకూడదు అనే ఉద్దేశంతో , సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తుందని అయితే పత్తి మిల్లాలు దళారులతో కుమ్మక్కై, పత్తి నాసి రకంగా ఉందనో, బాదు తీయాలనో, వివిధ కారణాలు చెబుతూ రైతులను మోసం చేసి కొనుగోలు చేసారని , పత్తి మిల్లుల్లో దింపకుండానే మాయాజాలం చేసి, దాదాపు 15 కోట్ల పైగా స్వాహా చేశారని మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నా దృష్టికి తీసుకురాగా, సీసీఐ అధికారికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదని, టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతికి దృష్టికి తీసుకెళ్లి ఆమె ద్వారా కూడా ఫోన్ చేయించానని ఆయినా కూడా ఆయన




స్పందించకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి వీరిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గం టీడీపీ నాయకులు సొసైటీ చైర్మన్ ఈరన్న, కొమ్ము రాజు, దేవనకొండ రాజశేఖర్, జనసేన ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ మరియు డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి.. సీపీఐ

మన గళం బనగానపల్లె : మెడికల్ మరియు డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి అని బనగానపల్లె సిపిఐ నాయకులు శివయ్య శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లెలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నటువంటి మెడికల్ షాపులను సీజ్ చేయాలని అలాగే విచ్చలవిడిగా డ్రగ్స్ పేరుతో పేద ప్రజలను దోచుకుంటున్న ఫార్మ కంపెనీలను సీజ్ చేయాలి బోగస్ మరియు నాణ్యతలేని మందులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దాడులు నిర్వహించాలి అని, డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థను బలోపేతం చేసి బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలి అని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజల ప్రాణులతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియా దందా విపరీత స్థాయికి చేరుకుందని నాణ్యతలేని నకిలీ మరియు సబ్ స్టాండర్డ్ మందులు విచ్చలవిడిగా మార్కెట్లో చలామణి అవుతున్నాయి కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ మెడికల్ మాఫియా దందా ని అరికట్ట లని ఫార్మాస్యూటికల్ కంపెనీలు అధిక లాభాల కోసం నాణ్యతను తాకట్టు పెడుతున్నాయని ప్రైవేట్ ఆస్పత్రిలో అవసరంలేని టెస్టులు చేస్తూ పేద ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ల్యాబ్ సెంటర్లో వైద్యులతో అవినీతి కమిషన్ వ్యవస్థ నెలకొల్పి ప్రజల జేబులో ఖాళీ చేస్తున్నారని వారు అన్నారు. కావున రాష్ట్రవ్యాప్తంగా బోగస్మందలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అలాగే డ్రగ్స్ ఇన్స్పెక్టర్ల ఖాళీలను భర్తీ చేసి దాడులు నిర్వహించాలని వాళ్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. ఎర్రిస్వామి అవుకు కార్యదర్శి నాగంజినేయులు రమేష్ సిపిఐ మండల నాయకులు ఖాదర్ సుబ్రహ్మణ్యం అధ్యక కార్యదర్శి కుల్లాయ్ స్వామి, రవి, మహిళా సమాఖ్య అధ్యక్షులు అక్కన్న గారి ఎల్లేశ్వరి,నర్సమ్మ పద్మావతి బనగానపల్లె అధ్యక్షులు మాథష్ సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


## మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు గదుల కేటాయింపులపై జిల్లా కలెక్టర్ సమగ్ర పరిశీలన





మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం వద్దకు భారీగా తరలివస్తున్న భక్తులకు సరైన వసతి సదుపాయాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ శనివారం పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మరియు కౌంటర్ విధానాల ద్వారా గదుల కేటాయింపు పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్న విషయంపై వారు సమీక్ష నిర్వహించారు. ముందస్తుగా బుక్ చేసుకున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గదులు అందుతున్నాయా, ప్రత్యేక కౌంటర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే అంశాలను పరిశీలించారు. అలాగే ఉచిత, చెల్లింపు వసతి గృహాలు, చౌల్ట్రీలు, డార్మిటరీల వద్ద పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గదుల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. భక్తులు మధ్యవర్తులను నమ్మకూడదని, అధికారిక కౌంటర్లు లేదా ఆన్‌లైన్ విధానాల ద్వారానే గదులు పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దైవ దర్శనం...మోక్ష మార్గం



**కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో..**
**ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి.**



(ఆలూరు మనగళం): గుంతకల్ నియోజకవర్గం, శని త్రయోదశి సందర్భంగా కసాపురంలో స్థానికంగా వెలసిన శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ను దర్శించుకున్న ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి తనయుడు యువనేత సాయి దినేష్. అనంతరం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి వారికి ఆకు పూజా సమర్పించిన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తీర్థం ప్రసాదలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైకుంఠం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువ రైతు మృతి



మన గళం కోడుమూరు; కోడుమూరు మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో యువ రైతు రాజేష్ (38) అప్పుల బాధతో శుక్రవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తనకున్న నాలుగు ఎకరాల పొలంలో పంటలు సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. మరోవైపు అప్పులు ఎలా తీర్చాలి అని మదన పడుతుండేవాడు. బ్యాంకులో తెచ్చిన రుణభారం పెరిగిపోవడంతో ఈ క్రమంలో గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

## ఏపీలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల సందర్భంగా నందవరం మండలంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహణ

నందవరం ఫిబ్రవరి మనగళం న్యూస్ 14 : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యార్థులకు పెద్ద ఉపశమనం కలిగించేలా, మంత్రి నారా లోకేష్ 2024 నుండి 25 విద్యా సంవత్సరానికి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నరూ. 1,198 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసినందుకు గానూ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు నందవరం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు కాశీంవలి ఆధ్వర్యంలో శనివారం నాడు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాబు, డిప్యూటీ సీం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బివి జయనాగేశ్వ రెడ్డి గార్ల చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు అనంతరం విద్యార్థులు, టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. దీంతో పాటు తాజాగా అసెంబ్లీలో ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి గారు వీరశైవ లింగాయత్, లింగబలిజ సామాజికవర్గానికి సంబంధించిన రిజర్వేషన్లకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీలో ప్రస్తావించడంపై కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసి ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల, గ్రామ కూటమి నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# శ్రీశైలంలో కళ్యాణ కట్టను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా





మనగళం శ్రీశైలం : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం సమగ్రంగా పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ కట్ట (ముండన మండపం) వద్ద ఏర్పాటు చేసిన సదుపాయాలను స్వయంగా సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కళ్యాణ కట్టలో భక్తులకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్, అక్కడి టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా, దుస్తులు మార్చుకునే గదులు సరైన విధంగా నిర్వహిస్తున్నారా, తగినంత నీటి సౌకర్యం ఉందా అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. శుభ్రత, పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారు ఏ ప్రాంతాల నుండి వచ్చారో తెలుసుకున్నారు. గుండు గీయించుకునే భక్తుల నుండి ఎంత రుసుము వసూలు చేస్తున్నారో, రశీదులు జారీ చేస్తున్నారా, క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో వివరాలు ఆరా తీశారు. నిర్ణయించిన చార్జీలకన్నా అధికంగా వసూలు చేయరాదని, భక్తులకు పారదర్శకమైన సేవలు అందించాలన్నారు. మహా శివరాత్రి సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, కళ్యాణ కట్ట వద్ద అదనపు సిబ్బంది నియామకం, తాగునీరు, కూర్చునే సౌకర్యం, భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

# పాతాళ గంగ వద్ద ఏర్పాటుచేసిన బందోబస్తును ఏర్పాట్లను పరిశీలన





మనగళం శ్రీశైలం : మెట్ల మార్గం ద్వారా వెళ్లే భక్తులు జాగ్రత్తగా ఉండాలి.... నదిలో బోటు నడిపే నిర్వాహకులు తప్పనిసరిగా భద్రత ప్రమాణాలు పాటించాలి..... ప్రయాణికులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్ వేసుకోవాలి.... నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు... జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ గారు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో పాతాళగంగ పరిసర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన బందోబస్తును జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఙూా గారు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు పాతాళగంగ మెట్ల మార్గం ద్వారా స్వయంగా పర్యటిస్తూ సంబంధిత అధికారులకు నిర్వహించవలసిన విధులపై పలు సూచనలు చేయడం జరిగింది. పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశం వరకు చేరుకున్న అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున మెట్ల మార్గం ద్వారా భక్తులు జాగ్రత్తగా వెళ్లాలని మరియు పుణ్యస్నానాలు ఆచరించు భక్తులు అధికారులు ఏర్పాటు చేసిన భద్రతా నిబంధనలు ఉల్లంఘించి ముందుకు వెళ్లరాలని శబ్ద యంత్రం (మైక్)ద్వారా భక్తులకు తెలియజేయాలన్నారు. బోట్ల ద్వారా ప్రయాణికులను విహారయాత్రకు తీసుకువెళ్లే బోటు నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలి.ప్రతి ఒక్క ప్రయాణికుని భద్రత ,రక్షణ దృష్టిలో ఉంచుకోవాలి. లైఫ్ జాకెట్ వేసుకున్న తర్వాతనే ప్రయాణం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది.

# శివరాత్రి రోజున 1.50 లక్షల మంది భక్తుల దర్శనానికి విస్తృత ఏర్పాట్లు





మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు శ్రీశైలానికి తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి తెలిపారు. శనివారం నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శివరాత్రి రోజున సుమారు 20 గంటల వ్యవధిలో భక్తులు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా దర్శనం చేసుకునే విధంగా సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అర్ధగంట వ్యవధిలోనే శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం లో స్వామివారి, అమ్మవార్ల దర్శనం పూర్తి చేసుకునేలా క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లు, ప్రసాద పంపిణీ వ్యవస్థలను సమర్థవంతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. దర్శనం అనంతరం భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. శుక్రవారం రోజున దాదాపు 80 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి ప్రసాదం, దేవస్థాన భోజన వసతి అందించి సాఫీగా నిర్వహించగలిగామని కలెక్టర్ వివరించారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు భక్తులు ఇదే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే దృష్ట్యా టోల్ గేట్ రుసుము మినహాయింపు, రాత్రి వేళల్లో ప్రయాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అటవీ మార్గంలో పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 ప్రాంతాల్లో త్రాగునీరు, అన్నదానం, వైద్య సేవలు, చలువ పందిళ్లు తదితర సదుపాయాలతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అటవీ మార్గంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్స అందించేందుకు 7 అంబులెన్సులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అవసరమైతే స్ట్రెచర్ల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించే చర్యలు కూడా చేపట్టినట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో ప్రయాణించే భక్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ శివనామస్మరణతో దర్శనం పూర్తి చేసుకుని సురక్షితంగా స్వస్థలాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



# పుల్వామా అమరులకు ఆలూరులో ఘన నివాళి



**– అంబేద్కర్ సర్కిల్‌లో మాజీ సైనికులు, రాజకీయ నాయకుల మౌన ప్రదర్శన.**

(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద శనివారం దేశభక్తి వాతావరణంలో పుల్వామా అమర జవాన్లకు ఘనంగా నివాళు లర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ-కాశ్మీర్‌లోని పుల్వామ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో వీరమరణం పొందిన సైనికుల స్మారకార్థం మాజీ సైనికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ వద్ద అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. అమర జవాన్లు అమరులే వీరులకు వందనం-దేశానికి అంకితం అంటూ నినాదాలు మారుమోగాయి. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగాన్ని ఎప్పటికీ మరువలేమని నాయకులు భావోద్వేగంగా తెలిపారు. మాజీ సైనికులు ప్రసాదు, సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు, వాల్మీకి గోపాల్ నాయుడు, మాట్లాడుతూ, పుల్వామా దాడి దేశాన్ని కలచివేసిన విషాద సంఘటన అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రజలందరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని, అమరుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాయకులు పూల రామాంజనేయులు, జనసేన జిల్లా కోఆర్డినేటర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, దేశ భద్రత కోసం సరిహద్దుల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న సైనికుల పట్ల ప్రతి భారతీయుడికి గౌరవభావం ఉండాలని చెప్పారు. పుల్వామా దాడి మనకు ఒక గుణపాఠమని, దేశ రక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొని అమరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమం మాజీ సైనికులు శివ ప్రసాద్, చిదానంద గౌడ్, మహేష్, గోపాల్, వీరభద్ర గౌడ్, కమలాకర్, వాల్మీకి గోపాల్ నాయుడు, వీర వీరేష్, రంజిత్ కుమార్, చత్రపతి, మున్నా, కన్నా, ఆనందు, లక్ష్మన్న, వంద్రి, సుధాకార్, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ మరియు డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి




మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణం లో ప్రైవేట్ హాస్పటల్ దోపిడి పై జిల్లా వైద్య శాఖ అధికారులు దాడులు నిర్వహించాలి సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుల భాగంగా ఈరోజు కోడుమూరు పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బి రాజు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు ఏఐటీయూసీ మండల కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు. మాట్లాడుతూ కోడుమూరు మండలంలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నటువంటి మెడికల్ షాపులను సీజ్ చేయాలని అలాగే విచ్చలుడిగా డ్రగ్స్ పేరుతో పేద ప్రజలను దోచుకుంటున్న ఫార్మ కంపెనీలను సీట్ చేయాలి బోగస్ మరియు నాణ్యతలేని మందులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దాడులు నిర్వహించాలి డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థను బలోపేతం చేసి బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలి దేశంలో ప్రజల ప్రాణులతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియా దందా విపరీత స్థాయికి చేరుకుందని నాణ్యతలేని నకిలీ మరియు సబ్ స్టాండర్డ్ మందులు విచ్చలవిడిగా మార్కెట్లో చలామణి అవుతున్నాయి అని కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ మెడికల్ మాఫియా దందా అని అరికట్టలని ఫార్మాస్యూటికల్ కంపెనీలు అధిక లాభాల కోసం నాణ్యతను తాకట్టు పెడుతున్నాయని ప్రైవేట్ ఆస్పత్రిలో అవసరంలేని టెస్టులు చేస్తూ పేద ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ల్యాబ్ సెంటర్లో వైద్యులతో అవినీతి కమిషన్ వ్యవస్థ నెలకొల్పి ప్రజల జేబులో ఖాళీ చేస్తున్నారని వాళ్లు అన్నారు కావున రాష్ట్రవ్యాప్తంగా బోగస్మందలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అలాగే డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు ఖాళీలను ఏర్పాటు చేసి దాడులు నిర్వహించాలని వాళ్లు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి హమాలి యూనియన్ నాయకులు నాగేష్ మద్ది శీను నాయుడు ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం

పిల్లల నవ్వు ప్రతి ఇంటి ఆనందానికి ప్రతీక. ఆ నవ్వు క్రమంగా మసకబారడం ఒక కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి చెందిన బాధ. బాల్య క్యాన్సర్ అనే పదం వినగానే భయం కలుగుతుంది. కానీ భయంతో కాదు, అవగాహనతో ఈ వ్యాధిని ఎదుర్కోవాలి. పిల్లల్లో కనిపించే క్యాన్సర్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యాన్ని తెలియజేయడం, సరైన చికిత్స అందుబాటులో ఉండేలా చూడడం, బాధిత కుటుంబాలకు మానసికఆర్థిక మద్దతు కల్పించడం ఇవే అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం ఉద్దేశాలు. బాల్య క్యాన్సర్‌ను చాలా మంది అరుదైన వ్యాధిగా భావిస్తారు. కానీ వాస్తవం అంత సులభం కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది పిల్లలు వివిధ రకాల క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. రక్త క్యాన్సర్, మెదడు గడ్డలు, లింఫోమా వంటి రకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. లక్షణాలు ప్రారంభ దశలో స్పష్టంగా కనిపించకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించే ప్రమాదం ఉంది. తరచూ జ్వరం రావడం, అసాధారణ వాపులు, బలహీనత, రక్తహీనత, ఆకలి తగ్గడం వంటి సూచనలను నిర్లక్ష్యం చేయకూడదు. ముందస్తు పరీక్షలు, వైద్యుల సలహా ప్రాణాలను కాపాడగలవు.

చికిత్స ఖరీదైనది, దీర్ఘకాలికం. నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు చికిత్స కొనసాగాల్సి ఉంటుంది. ఇది కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద భారం. మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. చికిత్స ఖర్చులు, ఆసుపత్రి వసతి, ఔషధాలు, ప్రయాణ ఖర్చులు కలిపి కుటుంబాన్ని తీవ్ర ఒత్తిడిలోకి నెడుతున్నాయి. అందుకే ప్రభుత్వ ఆరోగ్య పథకాలు బలోపేతం కావాలి. ప్రతి పిల్లవాడికి సమాన చికిత్స అందేలా వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రాంతాల వరకూ విస్తరించాలి.

బాల్య క్యాన్సర్ కేవలం శారీరక వ్యాధి కాదు. అది మానసిక పరీక్ష కూడా. చిన్న వయసులోనే పిల్లలు ఆసుపత్రి గదుల్లో రోజులు గడపాల్సి వస్తోంది. పాఠశాల, స్నేహితులు, ఆటల దూరమవుతున్నాయి. ఇది వారి భావోద్వేగ స్థితిపై ప్రభావం చూపుతుంది. కాబట్టి కౌన్సిలింగ్, మానసిక మద్దతు, విద్యా సౌకర్యాలు అవసరం. ఆసుపత్రుల్లో పిల్లలకు సానుకూల వాతావరణం కల్పించాలి. కుటుంబ సభ్యులకు కూడా ధైర్యం ఇవ్వాలి.

అవగాహన కార్యక్రమాలు మరింత విస్తరించాలి. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సభలు వేదికలుగా ఉపయోగించాలి. అపోహలను తొలగించాలి. క్యాన్సర్ అంటే అంతమని భావించే దృక్పథం మారాలి. సమయానికి గుర్తిస్తే చికిత్సతో నయం కావచ్చని ప్రజల్లో నమ్మకం పెంచాలి. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ ఖర్చుతో చికిత్స అందించే విధానాలను అభివృద్ధి చేయాలి. సమాజం కూడా బాధ్యత వహించాలి. బాధిత కుటుంబాలను ఒంటరిగా వదిలేయకుండా సహాయం చేయాలి. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలి. రక్తదానం, అవయవ దానం, ఆర్థిక సహాయం వంటి మార్గాల ద్వారా సహకారం అందించాలి. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా జీవించాలి అన్న సంకల్పం సమాజంలో బలపడాలి.

అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం మనకు ఒక గాఢమైన సందేశాన్ని ఇస్తుంది. చిన్నారి ప్రాణం అమూల్యం. ఆ ప్రాణాన్ని కాపాడడం మన సమిష్టి బాధ్యత. అవగాహనతో, సమగ్ర వైద్య సేవలతో, మానసిక మద్దతుతో ఈ వ్యాధిని ఎదుర్కోవచ్చు. ఆశను నింపే చర్యలు తీసుకుంటే చిన్నారి నవ్వు మళ్లీ వెలిగుతుంది.

మొత్తంగా బాల్య క్యాన్సర్‌పై పోరాటం వైద్య రంగానికే పరిమితం కాదు. అది సమాజం మొత్తం కలిసి చేయాల్సిన యుద్ధం. ప్రతి పిల్లవాడికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు హక్కు. ఆ హక్కును కాపాడడం మనందరి కర్తవ్యం. అదే ఈ దినం మనకు గుర్తు చేసే అసలు సత్యం. బాల్య క్యాన్సర్‌ను కేవలం వైద్య సమస్యగా చూడకూడదు. ఇది భావోద్వేగ పరీక్ష కూడా. చిన్న వయసులోనే చికిత్స బాధలు, ఆసుపత్రి జీవితం, పాఠశాల దూరం పిల్లల మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయి. అందుకే కౌన్సిలింగ్, కుటుంబ మద్దతు, పాఠశాలల సహకారం అవసరం. చికిత్సతో పాటు ఆశ, ధైర్యం కూడా సమానంగా అవసరం. అవగాహన కార్యక్రమాలు అత్యంత కీలకం. పాఠశాలలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, సమాజ సంస్థలు కలిసి ప్రజల్లో సమాచారం పంచాలి. అపోహలను తొలగించాలి. ప్రారంభ దశలో వైద్యులను సంప్రదించే అలవాటు పెంపొందించాలి. బాల్య క్యాన్సర్‌పై పరిశోధనలు, మెరుగైన చికిత్సా విధానాలు అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు పెరగాలి. అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం మనకు ఒక బాధ్యతను గుర్తు చేస్తుంది. చిన్నారుల ఆరోగ్యం కేవలం కుటుంబ బాధ్యత కాదు. అది సమాజం, ప్రభుత్వం, వైద్య వ్యవస్థ, ప్రతి పౌరుడి బాధ్యత. ప్రతి పిల్లవాడికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు అందించాలంటే సమగ్ర చర్యలు అవసరం. మొత్తంగా బాల్య క్యాన్సర్‌పై పోరాటం కేవలం వైద్య రంగానికే పరిమితం కాదు. అవగాహన, మద్దతు, సంరక్షణ కలిసినప్పుడే విజయవంతం అవుతుంది. ప్రతి చిన్నారి నవ్వు కాపాడడం మన సమిష్టి కర్తవ్యం. ఆశను నింపే ప్రయత్నం చేయడం మన బాధ్యత. అదే ఈ దినం ఇచ్చే అసలైన సందేశం.

## శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు రేంజ్ డివిజి మరియు జిల్లా ఎస్పీ





మనగళం శ్రీశైలం : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్ గారు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్ ×ూా గారు మరియు జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ×ూా గారు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ గారు మాట్లాడుతూ పాగా అలంకరణ దర్శనం కోసం ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చెయ్యాలని,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి. క్యూ లైన్లను, భక్తుల రాకపోకల మార్గాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చెయ్యాలి. ఒక పద్దతి ప్రకారం గుడి పరిసరాలలో భక్తులు ఉంటూ స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు పాగా అలంకరణ విక్షించేలా చర్యలు తీసుకోవాలి. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలి. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా మరియు బందోబస్తు తదితర అంశాలపై సమన్వయంతో విధులు నిర్వహించాలి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చోట అధికారులకు సూచనలు ఇవ్వాలి. భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలతో పాగా అలంకరణను వీక్షించాలని అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ గారితో పాటు జిల్లా ఎస్పీ గారు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన దేవదాయ కమిషనరు






మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి ఏర్పాట్లను ఈ రోజు (14.02.2026) దేవదాయ కమిషనరు శ్రీ కె. రామచంద్రమోహన్ పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు మొదలైనవాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీ ఎస్.ఎస్. అజాద్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనరువారు మాట్లాడుతూ క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాట లేకుండా ఉండేందుకుగాను పోలీస్‌శాఖ సమన్వయంతో తగు ఏర్పాట్లు ఉండాలన్నారు. అలాగే తగినస్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని మరియు శివసేవకులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్యూకాంప్లెక్స్‌లోనూ నిరంతరం అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు మొదలైనవాటిని అందజేస్తుండాలన్నారు. క్యూలైన్లలో కూడా నిరంతరం మంచినీటిని అందజేస్తుండాలన్నారు. క్యూలైనులో ఏర్పాటు చేయబడిన వాటర్ పాయింట్లకు నిరంతరం నీటిసరఫరా ఉండాలన్నారు. క్యూలైన్లలో అవాంఛనీయ సంఘటనలు నిరోధించేందుకు మరియు అత్యవసర సమయాలలో వినియోగించుకునేందుకు క్యూలైన్లలో ఏర్పాటు చేయబడిన అత్యవసర గేట్లు ( ఎమర్జెన్సీ ఎగ్జిట్ గేట్లు) సజావుగా పనిచేసేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా క్యూకాంప్లెక్స్‌లోని శౌచాలయాల శుభ్రతపట్ల ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలన్నారు. అన్నీ శౌచాలయాలలో కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం నీటిసరఫరా ఏర్పాటు ఉండాలన్నారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లలో కూడా మంచినీరు ఉండాలన్నారు. ఇంకా కమిషనరు వారు మాట్లాడుతూ భక్తులు అధికసమయం క్యూలైన్లలో వేచివుండకుండా త్వరితంగా ప్రసాదాలను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నప్రసాదవితరణ జరుగుతుండాలన్నారు. ఆయావంటకాలన్నీ రుచికరంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్నప్రసాదాలను స్వీకరించేందుకు వచ్చిన భక్తులు అధికసమయం వేచివుండకుండా వుండేందుకు తగు చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించారు. ఇందుకుగాను అన్నదానమందిరంలోని ఆయా భోజనశాలలో తగు ముందస్తు ఏర్పాట్లు ఉండాలన్నారు. అన్నప్రసాద వితరణ సమయములో సంబంధిత అధికారులు ప్రతి హాలులో కూడా అన్నప్రసాద వితరణ సజావుగా జరిగేటట్లు పర్యవేక్షిస్తుండాలన్నారు. ప్రతి హాలును కూడా ప్రత్యేకంగా సిబ్బందిలో ఒకరు నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. అన్నదాన మందిరములో శుచీ శుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎప్పటికప్పుడు అన్నదాన మందిరాన్ని శుభ్రపరుస్తుండాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రపరిధిలో పారిశుద్ధ్యంపైకూడా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు. చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించేవిధంగా పర్యవేక్షక సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శౌచాలయాలకు నిరంతరం నీటిసరఫరా ఉండేవిధంగా తగు ఏర్పాట్లు ఉండాలన్నారు. శౌచాలయాలు కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది అందరు కూడా భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. భక్తులు అడిగిన సమాచారాన్ని శివసేవకులు, సిబ్బంది ఓపికగా అందిస్తుండాలన్నారు. ఆలయ సమాచార వ్యవస్థద్వారా నిరంతరం భక్తులకు సమాచారాన్ని తెలియజేస్తుండాలన్నారు.

## రాష్ట్ర స్థాయి వేదిక్ మ్యాథ్స్ లో న్యూ విశ్వవాణి హై స్కూల్ ప్రభంజనం

మన గళం కోడుమూరు: విజయవాడలో విశ్వం ఎడిటెక్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేదిక్ గణితంలో పట్టణానికి చెందిన న్యూ విశ్వవాణి హై స్కూల్ విద్యార్థులు విజేత గా నిలిచారు. దాదాపు 950 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో అందర్నీ నెట్టేసి తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్ బి గణేష్ అనే విద్యార్థి మొదటి స్థానంలో నిలిచారు... అలాగే రెండో లెవెల్ లో జరిగిన పోటీల్లో కార్తీక్ మరియు మాధవ అనే విద్యార్థులు రెండు, మూడు స్థానాలను కైవశం చేసుకున్నట్టు స్కూల్ యాజమాన్యం ఖలీల్ గిడ్డయ్య శ్రీనివాసులు తెలిపారు. వేదిక్ పోటీలో గెలుపొందిన విద్యార్థులను స్కూల్ మేనేజ్మెంట్ అభినందించారు. విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్ లో మెళకువలను నేర్పిన టీచర్లను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయునీయులు భారతీ, కల్పనా, రెహానా, సంధ్య, నస్రిన్ తదితరులు పాల్గొన్నారు.



# టాటా ఏఐఏ నుంచి రెండు కొత్త పథకాలు..

హైదరాబాద్ ఫిబ్రవరి 14,మన గళం : ప్రముఖ బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ పెట్టుబడిదారులను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త పథకాలను ప్రారంభించింది. దీర్ఘకాలిక సంపద సృష్టితో పాటు కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే విధంగా రూపొందించిన ఈ పథకాలలో పెట్టుబడి పెట్టేందుకు ఫిబ్రవరి 16ను చివరి తేదీగా సంస్థ ప్రకటించింది. పెట్టుబడితో పాటు బీమా రక్షణ కూడా అందించడం ఈ పథకాల ప్రత్యేకతగా నిలుస్తోంది.




సంపద పెంపు లక్ష్యంగా విలువ ఆధారిత ఈక్విటీ పెట్టుబడి విధానంతో ఈ రెండు పథకాలు రూపొందించబడ్డాయి. ఒకటి విలువ సూచీ ఆధారిత వృద్ధి పథకం కాగా, మరొకటి విరమణ అనంతర అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పెన్షన్ పథకం. మార్కెట్‌లోని వివిధ రంగాలకు చెందిన పెద్ద, మధ్యతరహా, చిన్న సంస్థల వాటాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన లాభాలను అందించడమే లక్ష్యంగా సంస్థ తెలిపింది.

ఈ పథకాలలో కనీసంగా నెలకు రెండు వేల నుంచి మూడు వేల రూపాయల వరకు పెట్టుబడితో ప్రారంభించవచ్చు. ఒకేసారి పెట్టుబడి పెట్టే వారికి సంవత్సరానికి కనీసం ఇరవై నాలుగు వేల నుంచి ముప్పై వేల రూపాయల వరకు పెట్టుబడి అవసరం ఉంటుంది. ప్రారంభ దశలో యూనిట్ ధర పది రూపాయలుగా నిర్ణయించారు. విలువ సూచీ పథకం ముఖ్యంగా పిల్లల విద్య, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలు వంటి దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. మరోవైపు పెన్షన్ పథకం విరమణ అనంతరం స్థిరమైన ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఉంది. ఈ రెండు పథకాలలో పెట్టుబడి చేసిన మొత్తంపై లాభాలతో పాటు బీమా రక్షణ కూడా వర్తిస్తుంది. పన్ను చట్టాల ప్రకారం నిర్దిష్ట నిబంధనల కింద పన్ను మినహాయింపు ప్రయోజనాలు కూడా పొందవచ్చని సంస్థ తెలిపింది. మార్కెట్ ఆధారిత లాభాలను ఆశిస్తూ, అదే సమయంలో కుటుంబ భద్రతను కూడా కోరుకునే పెట్టుబడిదారులకు ఈ పథకాలు అనుకూలంగా ఉంటాయని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# కేంద్రం సంచలన నిర్ణయం..




న్యూఢిల్లీ ఫిబ్రవరి 14,మన గళం : రైల్వే టిక్కెట్ బుకింగ్‌లో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వే టికెట్ రిజర్వేషన్ కోసం ఉపయోగించే అనుమానాస్పద ఖాతాలపై కఠిన చర్యలు తీసుకుంటూ సుమారు మూడు కోట్లకు పైగా ఐడీలను నిలిపివేసినట్లు కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. ఈ నిర్ణయం వల్ల నిజమైన ప్రయాణికులకు టిక్కెట్లు సులభంగా లభించే అవకాశాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. టికెట్ బుకింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న నకిలీ ఖాతాలను గుర్తించి, 2025 నాటికి భారీ స్థాయిలో చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. గత ఆరు నెలల్లో కోట్ల సంఖ్యలో హానికరమైన ఈమెయిల్ సందేశాలను కూడా నిరోధించినట్లు పేర్కొన్నారు. తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌లో పారదర్శకత పెంచేందుకు ఆధార్ ఆధారిత ఒకసారి ఉపయోగించే సంకేత సంఖ్య ధృవీకరణను ప్రవేశపెట్టారు. ఈ విధానం ద్వారా టికెట్ బుక్ చేసే వ్యక్తి గుర్తింపును వెంటనే నిర్ధారించుకోవచ్చు. దీంతో నకిలీ ఖాతాల ద్వారా టిక్కెట్లు బుక్ చేసే అవకాశాలు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా బహుళ స్థాయిల భద్రతా నియంత్రణలు, కాప్చా వ్యవస్థలు అమలు చేసి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించే సాంకేతిక ఏర్పాట్లు చేశారు. వెబ్‌సైట్‌పై ఒత్తిడి తగ్గించేందుకు ఆధునిక సాంకేతిక వ్యవస్థలను ఉపయోగిస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ చర్యలతో టికెట్ బుకింగ్ ప్రక్రియ మరింత సురక్షితంగా మారడంతో పాటు, సాధారణ ప్రయాణికులకు తత్కాల్ టిక్కెట్లు పొందడం సులభమవుతుందని అధికారులు వెల్లడించారు.

# కవాసకీ నింజా బైక్‌లపై రూ. 2.50 లక్షల వరకు భారీ తగ్గింపు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 14 ,మన గళం జపాన్‌కు చెందిన ద్విచక్ర వాహన తయారీ సంస్థ కవాసకీ ఇండియా ఫిబ్రవరి నెలకు గానూ తన నింజా శ్రేణి బైక్‌లపై భారీ తగ్గింపులను ప్రకటించింది. ఎంపిక చేసిన నింజా 650, నింజా 500, నింజా 300 మోడళ్లపై రూ. 2.50 లక్షల వరకు నగదు తగ్గింపుతో పాటు కొన్ని ఉచిత ఉపకరణాలు కూడా అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్లు ఫిబ్రవరి 28 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి.



కొత్త ఇంధన ప్రమాణాలకు అనుగుణంగా లేని పాత నిల్వలను ఖాళీ చేయడమే ఈ ఆఫర్ల ప్రధాన ఉద్దేశమని సమాచారం. ప్రస్తుతం అమల్లోకి వస్తున్న ఇంధన నిబంధనలకు సరిపోని మోడళ్లను విక్రయించేందుకు సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రీమియం శ్రేణి బైక్‌లను కొనుగోలు చేయాలనుకునే యువతకు ఇది మంచి అవకాశంగా మారింది.

అయితే ఈ తగ్గింపులు అన్ని మోడళ్లకు వర్తించవు. కేవలం ఎంపిక చేసిన నింజా శ్రేణి బైక్‌లపైనే ఈ సదుపాయం ఉంటుంది. తాజా సాంకేతికత కంటే పనితీరు, బ్రాండ్ విలువకు ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారులకు ఈ ఆఫర్ ప్రయోజనకరంగా ఉండనుంది. ఆసక్తి ఉన్నవారు సమీప విక్రయ కేంద్రాలను సంప్రదించాలని సంస్థ సూచించింది.

# గోల్డ్ లోన్‌పై ఆర్‌బీఐ కీలక మార్పులు




ముంబై ఫిబ్రవరి 14,మన గళం :అత్యవసర పరిస్థితుల్లో తక్షణంగా నగదు అవసరమైనప్పుడు చాలామంది బంగారం మీద రుణాన్ని ఎంచుకుంటారు. ఈ నేపథ్యంలో బంగారం రుణాలు తీసుకునే వారికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక మార్పులు ప్రకటించింది. తాజా నిబంధనలు రుణగ్రహీతలకు మరింత ఆర్థిక సౌలభ్యం, భద్రత కల్పించేలా రూపొందించబడినట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా లోన్ టు వ్యాల్యూ నిష్పత్తిలో మార్పులు చేసి, బంగారం విలువపై మరింత రుణం పొందే అవకాశాన్ని కల్పించారు. ఇప్పటి వరకు బంగారం విలువలో 75 శాతం వరకు మాత్రమే రుణం లభించగా, కొత్త నిబంధనల ప్రకారం కొన్ని పరిమితులలో ఇది 85 శాతం వరకు పెరిగింది. రూ. 2.5 లక్షల వరకు రుణం తీసుకుంటే 85 శాతం, రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు 80 శాతం, రూ. 5 లక్షలకంటే ఎక్కువ రుణాలకు 75 శాతం నిష్పత్తి వర్తిస్తుంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువ మొత్తాన్ని పొందే అవకాశం రుణగ్రహీతలకు లభించనుంది.

అలాగే ఇప్పటికే తీసుకున్న బంగారం రుణంపై అదనపు రుణం పొందే అవకాశం కూడా కల్పించారు. టాప్-అప్ రుణం ద్వారా అదే బంగారాన్ని తాకట్టు ఉంచి మరింత నిధులు పొందవచ్చు. అయితే ఈ సౌకర్యం పొందేందుకు రుణగ్రహీత చెల్లింపుల చరిత్ర సక్రమంగా ఉండాలి.

# కొత్త ఆధార్ కార్డులు రానున్నాయి.. కనిపించని వివరాలు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 14,మన గళం : దేశవ్యాప్తంగా గుర్తింపు పత్రంగా వినియోగంలో ఉన్న ఆధార్ కార్డులో కీలక మార్పులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ శ్రీకారం చుట్టింది. ఆధార్ ఫోటోకాపీల దుర్వినియోగంతో పెరుగుతున్న సైబర్ మోసాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆధార్ కార్డుపై చిరునామా, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వ్యక్తిగత వివరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ వివరాలను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో జారీ చేసే కొత్త కార్డులపై సున్నితమైన సమాచారాన్ని తగ్గించాలని నిర్ణయించారు.




నివేదికల ప్రకారం, ఇకపై కొత్తగా ఇచ్చే ఆధార్ కార్డుపై కేవలం ఫోటో మరియు త్వరిత స్పందన సంకేతం మాత్రమే కనిపించేలా మార్పులు చేయనున్నారు. వ్యక్తిగత వివరాలు కార్డుపై ముద్రించబడవు. దీని ద్వారా ఎక్కడ పడితే అక్కడ ఆధార్ ప్రతులు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలను తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. కార్డుపై ఉండే త్వరిత స్పందన సంకేతాన్ని స్కాన్ చేయడం ద్వారా బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు అవసరమైన వివరాలను ధృవీకరించుకోగలవు. ఈ విధానంతో వ్యక్తిగత గోప్యతకు మరింత భద్రత లభిస్తుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా ఆధార్ సేవలకు సంబంధించిన మొబైల్ అనువర్తనంలో కూడా పలు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వేలిముద్రలను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా మళ్లీ ప్రారంభించడం, చిరునామా వంటి వివరాలను సవరించడం, డిజిటల్ రూపంలో ఆధార్‌ను వినియోగించడం వంటి సేవలను వినియోగదారులు సులభంగా పొందవచ్చు.

ఆధార్ ప్రతుల దుర్వినియోగాన్ని పూర్తిగా అడ్డుకునే దిశగా ఈ మార్పులను త్వరలోనే అమలు చేయనున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. గత సంవత్సరం చివరి నుంచే ఈ మార్పులకు సంబంధించి సన్నాహాలు కొనసాగుతున్నాయని సమాచారం.

# బీఎస్ఎన్ఎల్ నుంచి మరో కొత్త రీచార్జ్ పథకం

హైదరాబాద్ ఫిబ్రవరి 14 ,మన గళం : ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం మరో వార్షిక రీచార్జ్ పథకాన్ని ప్రకటించింది. ఇటీవల ప్రవేశపెట్టిన వార్షిక ప్యాక్‌కు కొనసాగింపుగా, ఎక్కువ డేటా అవసరమయ్యే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

రూ. 2799తో అందుబాటులో ఉన్న ఈ పథకంలో రోజుకు 3 జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఈ ప్యాక్ చెల్లుబాటు కాలం 365 రోజులు. ఎక్కువగా ఇంటర్నెట్ వినియోగించే వారికి ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ తెలిపింది. ఇదిలా ఉండగా, రూ. 2626తో మరో వార్షిక పథకాన్ని కూడా సంస్థ కొనసాగిస్తోంది. ఈ ప్యాక్‌లో రోజుకు 2.6 జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు అందుబాటులో ఉంటాయి. 'దేశ్ కా నెట్‌వర్క్, దేశ్ కా భరోసా' అనే ప్రచారంతో ఈ పథకాన్ని వినియోగదారులకు పరిచయం చేసింది. ఈ ప్రత్యేక ఆఫర్ ఫిబ్రవరి 24 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని సంస్థ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం సేవలు పొందాలనుకునే వినియోగదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పథకాలను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అవికా గోర్ తొలి ప్రేమికుల దినోత్సవం..



ముంబై ఫిబ్రవరి 14,మన గళం : పెళ్లి తర్వాత తమ తొలి ప్రేమికుల దినోత్సవాన్ని నటి అవికా గోర్, ఆమె భర్త మిలింద్ చంద్వానా ఎంతో సాధారణంగా, అర్థవంతంగా జరుపుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంటకు ఇది తొలి ప్రేమికుల దినోత్సవం కావడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారీ వేడుకలు, ఖరీదైన బహుమతుల కంటే కలిసి గడిపే సమయానికే ప్రాధాన్యం ఇస్తామని అవికా వెల్లడించింది. ఇది కేవలం ఒక రోజు కాదని, కలిసి నిర్మించుకుంటున్న తమ చిన్న ప్రపంచాన్ని గౌరవించుకునే సందర్భమని ఆమె భావోద్వేగంగా పేర్కొంది. ప్రేమ అంటే బహుమతులు కాదని, ఒక ప్రాణాన్ని కాపాడటమే నిజమైన ఆనందమని ఈ జంట తెలిపింది. ఇటీవల చిత్రీకరణ సమయంలో వీధి కుక్కల బారి నుంచి ఒక చిన్న పిల్లిని రక్షించి 'షిరీ' అని పేరు పెట్టుకుని ఇంట్లోకి తీసుకువచ్చారు. సంప్రదాయ బహుమతులకంటే ఈ నిర్ణయం తమ ఆలోచనలు, విలువలు ఒకటేనని చెప్పే నిదర్శనమని అవికా చెప్పింది.రోమాన్స్ అంటే ఆర్భాటం కాదని, కష్టకాలాల్లో ఒకరికొకరు అండగా నిలబడటం, కలిసి నవ్వుకోవడం, చేతులు పట్టుకుని నడవాలని అనిపించడమే అసలైన ప్రేమ అని ఆమె అభిప్రాయపడింది. పెళ్లి తర్వాత వచ్చిన ప్రశాంతత తమ బంధాన్ని మరింత బలపరచిందని ఈ జంట తెలిపింది. చిన్నారి పెళ్లి కూతురు ధారావాహికతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్, ఆ తరువాత సినిమాలు, కార్యక్రమాల ద్వారా ప్రేక్షకులను అలరిస్తూ వస్తోంది. సామాజిక మాధ్యమాల్లో కూడా ఆమెకు మంచి ఆదరణ ఉంది.

# ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని..

హైదరాబాద్ ఫిబ్రవరి 14 ,మన గళం :

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తెలుగు సినీ అభిమానులకు ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విడుదలైన పోస్టర్‌లో "ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని" అనే భావోద్వేగ డైలాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం యువతను ఆకట్టుకునేలా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు సినీ రంగంలోకి అడుగుపెడుతుండటంతో సినిమాపై సహజంగానే అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటి కుమార్తె రాషా తడాని కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతోంది. 'ఆర్ ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఫస్ట్ లుక్ విడుదలతోనే 'శ్రీనివాస మంగాపురం'పై సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రేమకథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం త్వరలోనే చిత్రీకరణ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న కొత్త హీరోగా జయకృష్ణ ఎలా మెప్పిస్తాడో అన్న ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది.




# అట్లీ ప్రాజెక్ట్‌పై అల్లు అర్జున్ అసంతృప్తి..?



హైదరాబాద్ ఫిబ్రవరి 14 ,మన గళం : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ దర్శకుడు అట్లీ కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై సినీ పరిశ్రమలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. సుమారు రూ.800 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. విశ్వ స్థాయి దృశ్య ప్రభావాలు, ఉన్నత స్థాయి గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను రూపుదిద్దుతున్నారని చెప్పడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్రానికి సంబంధించిన చిన్న సమాచారం వచ్చినా సామాజిక మాధ్యమాల్లో క్షణాల్లో వైరల్ అవుతోంది. వ్యాపార వర్గాల అంచనాల ప్రకారం, ఈ చిత్రం విడుదలైన తర్వాత భారతీయ సినీ నిర్మాణ శైలిలో కొత్త ధోరణికి నాంది పలికే అవకాశం ఉందని చెబుతున్నారు. భారీ స్థాయి చిత్రాలకు ఇది మార్గదర్శకంగా నిలవొచ్చని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

అయితే తాజా గాసిప్స్ ప్రకారం, సినిమా చిత్రీకరణ అనుకున్న వేగంలో సాగడం లేదని టాక్ వినిపిస్తోంది. ప్లాన్ చేసిన విడుదల తేదీకి సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన అల్లు అర్జున్‌కు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నిర్మాణ బృందంతో సమావేశమై చిత్రీకరణ షెడ్యూల్‌ను మరింత క్రమబద్ధీకరించి, వేగవంతం చేయాలని సూచించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా, ఈ ప్రాజెక్ట్ అనంతరం అల్లు అర్జున్ తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఆ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇప్పటికే వెలువడటంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఆ ప్రాజెక్ట్ కూడా భారీ స్థాయిలో తెరకెక్కనుందని సమాచారం. మొత్తంగా చూస్తే, అట్లీ అల్లు అర్జున్ కాంబినేషన్ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వరుసగా భారీ ప్రాజెక్ట్‌లు చేతిలో ఉండటంతో అల్లు అర్జున్ స్థాయి అంతర్జాతీయ స్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అభిమానులు మాత్రం ఈ భారీ చిత్రాల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

# సినిమాలు లేవు..

## కానీ సోషల్ మీడియాలో ఫుల్ బిజీగా ప్రణీత సుభాష్

హైదరాబాద్ ఫిబ్రవరి 14 ,మన గళం : నటి ప్రణీత సుభాష్ తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కథానాయికగా నిలిచింది. 'ఏం పిల్లో ఏం పిల్లడో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ తొలి చిత్రంతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. సొగసుతో పాటు సహజమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని తక్కువ సమయంలోనే మంచి అవకాశాలను అందుకుంది. ఆ తర్వాత నటుడు సిద్ధార్థ్ సరసన నటించిన 'బావ' చిత్రం ఆమెకు మరింత పేరు తీసుకొచ్చింది. ఆ చిత్ర విజయంతో వరుసగా అవకాశాలు రావడంతో ప్రణీత తెలుగు చిత్రాల్లో బిజీగా మారింది. కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక కథలతో కూడిన సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది. అందం, అభినయం రెండింటినీ సమతూకంగా చూపిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. తరువాత కాలంలో పలు భాషల్లో నటించినప్పటికీ, తెలుగులోనే ఆమెకు విశేషమైన ఆదరణ లభించింది. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, రామ్ పోతినేని, మంచు విష్ణు వంటి ప్రముఖ హీరోల సరసన నటించి అభిమానులను అలరించింది. ప్రధాన కథానాయికగా మాత్రమే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా స్వీకరిస్తూ తన నటనను చాటుకుంది. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రణీత ఇటీవల చిత్రాలకు కొంత విరామం ఇచ్చింది. వివాహం అనంతరం కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉన్న ఆమె ఇద్దరు పిల్లలకు తల్లిగా కొత్త జీవితాన్ని ఆనందంగా సాగిస్తోంది. అయినప్పటికీ ఆమె ఆకర్షణ, శైలి ఏమాత్రం తగ్గలేదని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

సినిమాలకు దూరంగా ఉన్నా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు అనుసంధానంగా ఉంటోంది. కుటుంబంతో గడిపే క్షణాలు, కొత్త ఫోటోలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు మరోసారి అభిమానుల్లో చర్చకు దారితీసి, సినిమాల్లో తిరిగి ఎప్పుడు కనిపిస్తుందనే ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.





# చిన్నస్వామికి కొత్త కళ.. భారత దిగ్గజాల పేర్లతో స్టాండ్లు



బెంగళూరు ఫిబ్రవరి 14 ,మన గళం : బెంగళూరులోని చిన్నస్వామి మైదానం త్వరలో కొత్త రూపాన్ని సంతరించుకోనుంది. క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కర్నాటక క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన దిగ్గజాల పేర్లను స్టేడియంలోని స్టాండ్లకు పెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు మాజీ కెప్టెన్లు అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్ అలాగే భారత మహిళల జట్టు తొలి కెప్టెన్ శాంత రంగస్వామి పేర్లతో స్టాండ్లు ఏర్పాటు చేయనున్నట్లు సంఘం వెల్లడించింది. భారత క్రికెట్ అభివృద్ధిలో వీరి పాత్రను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అనిల్ కుంబ్లే భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన స్పిన్నర్‌గా గుర్తింపు పొందాడు. టెస్టు క్రికెట్‌లో ఆరు వందలకు పైగా వికెట్లు సాధించి దేశానికి ఎన్నో విజయాలు అందించాడు. రాహుల్ ద్రవిడ్ తన స్థిరమైన ఆటతీరుతో భారత జట్టుకు ఎన్నో కీలక విజయాల్లో ప్రధాన పాత్ర పోషించాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్లలో అగ్రగామిగా నిలిచాడు. శాంత రంగస్వామి భారత మహిళల జట్టుకు తొలి కెప్టెన్‌గా చరిత్ర సృష్టించడంతో పాటు మహిళల క్రికెట్‌కు బలమైన పునాది వేసింది. గతంలో జరిగిన తొక్కిసలాట ఘటన తర్వాత చిన్నస్వామి మైదానంలో మ్యాచ్‌ల నిర్వహణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. అభిమానుల భారీ రద్దీ కారణంగా జరిగిన ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడంతో భద్రతా ఏర్పాట్లపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అనంతరం నియమించిన కమిషన్ నివేదిక ఆధారంగా పలు మార్పులు చేపట్టారు. ఇప్పటికే క్రికెట్ మ్యాచ్‌ల పునఃప్రారంభానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మళ్లీ బెంగళూరులో అంతర్జాతీయ మ్యాచ్‌లు, ప్రముఖ లీగ్ పోటీలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టాండ్లకు దిగ్గజాల పేర్లు పెట్టడం ద్వారా చిన్నస్వామి మైదానం కొత్త గుర్తింపుతో అభిమానులను ఆకట్టుకోనుంది.





# పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు కొలంబోలో ప్రియురాలితో కనిపించిన పాండ్య



కొలంబో ఫిబ్రవరి 14 ,మన గళం : టీ20 ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య మరోసారి వార్తల్లో నిలిచాడు. కొలంబోలోని ఓ హోటల్ లాబీలో తన ప్రియురాలు మహిక శర్మతో కలిసి కనిపించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

భారత క్రికెట్ నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం విదేశీ పర్యటనల సమయంలో ఆటగాళ్లు కుటుంబ సభ్యులతో ఉండకూడదనే నియమం ఉన్నప్పటికీ, పాండ్య ప్రియురాలితో కనిపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ విషయంపై జట్టు యాజమాన్యం నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా పాండ్య తన మెడపై 'ఎమ్' అనే అక్షరాన్ని టాటూగా వేయించుకున్నాడని సమాచారం. అది తన ప్రియురాలి పేరులోని మొదటి అక్షరమని ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా ఇద్దరూ సంబంధంలో ఉన్నట్లు క్రీడా వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన మ్యాచ్‌లో తన ప్రదర్శనను కూడా ఆమెకు అంకితమిచ్చినట్లు పాండ్య పేర్కొన్న విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా, టీ20 ప్రపంచకప్ పోటీల కోసం శ్రీలంక చేరుకున్న భారత జట్టుకు ఘన స్వాగతం లభించింది. స్థానిక కళాకారులు సంప్రదాయ వాద్యాలతో ఆటగాళ్లకు స్వాగతం పలికారు. భారత్‌పాకిస్థాన్ పోరుకు ముందు ఈ పరిణామం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పదో తరగతి పరీక్షలు రాయనున్న వైభవ్ సూర్యవంశీ

సమస్తిపూర్ ఫిబ్రవరి 14 ,మన గళం : అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి బోర్డు పరీక్షలకు ఆయన హాజరు కానున్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతూ చదువులోనూ ముందుకు సాగుతున్న ఈ యువ ఆటగాడు మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్‌లో ఉన్న పోద్దార్ పాఠశాలలో వైభవ్ పరీక్షలు రాయనున్నాడు. అండర్-19 టోర్నమెంట్‌లో తన అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందిన ఆయన ప్రస్తుతం పరీక్షలపై దృష్టి సారించాడు. క్రికెట్‌లో సాధించిన విజయాలతో పాటు చదువును సమానంగా కొనసాగిస్తున్నాడని పాఠశాల వర్గాలు తెలిపాయి. పరీక్షల సందర్భంగా వైభవ్‌కు ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు ఉండవని, ఇతర విద్యార్థుల మాదిరిగానే పరీక్షలకు హాజరవుతాడని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది. ఆటలో దేశానికి గర్వకారణంగా నిలిచిన వైభవ్, చదువులోనూ మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.




# భారత్‌తో మ్యాచ్‌లో మా తురుపుముక్క అతడే: పాక్ కెప్టెన్




కొలంబో ఫిబ్రవరి 14 ,మన గళం : టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం భారత్‌తో జరగనున్న కీలక పోరుకు ముందు పాకిస్థాన్ జట్టు కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ తమ జట్టుకు తురుపుముక్క అని పేర్కొన్నారు. అతని బౌలింగ్‌పై జరుగుతున్న విమర్శలను ఆయన ఖండించారు. మీడియాతో మాట్లాడుతూ ఉస్మాన్ తారిఖ్ తమకు కీలక బౌలర్ అని, అతని బౌలింగ్ యాక్షన్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇప్పటికే రెండుసార్లు అనుమతించినప్పటికీ అనవసరంగా చర్చ జరుగుతోందని తెలిపారు. ఈ విమర్శలను ఉస్మాన్ పట్టించుకోవడం లేదని, మ్యాచ్‌లో అతను జట్టుకు కీలక పాత్ర పోషిస్తాడని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఫామ్‌పై స్పందిస్తూ, అతని ప్రదర్శన తమకు ఎలాంటి ఆందోళన కలిగించడం లేదని స్పష్టం చేశారు. రాబోయే మ్యాచ్‌లో బాబర్ మంచి పరుగులు చేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచకప్‌లలో భారత్‌పై తమ రికార్డు ఆశించిన స్థాయిలో లేదని సల్మాన్ అంగీకరించారు. గతాన్ని మార్చలేమని, అయితే ఈసారి మెరుగైన ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# ఆఫ్ఘనిస్తాన్ జట్టు సభ్యుడికి గుండెపోటు.. ఢిల్లీలో అత్యవసర చికిత్స

న్యూఢిల్లీ ఫిబ్రవరి 14 ,మన గళం : టీ20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టుకు ఆందోళన కలిగించే ఘటన చోటుచేసుకుంది. జట్టు పనితీరు విశ్లేషకుడిగా పనిచేస్తున్న కేసీ రామ సుబ్రమణియన్ హోటల్‌లో ఉన్న సమయంలో గుండెపోటుకు గురైనట్లు సమాచారం. జట్టు వైద్య బృందం వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం దక్షిణ ఢిల్లీలోని ఫోర్టిస్ ఆస్పత్రిలికు తరలించింది. అక్కడ వైద్యులు ఆయనకు అంగియోప్లాస్టీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నప్పటికీ, పరిశీలన నిమిత్తం ఐసీయూలో ఉంచినట్లు సన్నిహితులు వెల్లడించారు.

ఈ సమాచారం తెలిసిన వెంటనే ఆఫ్ఘనిస్తాన్ జట్టు కెప్టెన్ రషీద్ ఖాన్, సీనియర్ ఆటగాడు మొహమ్మద్ నబీ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. జట్టు సభ్యుడి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కుటుంబానికి గోప్యత కల్పించాలని ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. అవసరమైన అన్ని వైద్య సహాయాలు అందించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి మరియు అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రతినిధులు కూడా సమన్వయం చేస్తున్నట్లు సమాచారం.




Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.